క్లుప్తంగా

'ఇంద్రధనుష్' పరిశీలన



దామరచర్లలో ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న స్టేట్ అబ్జర్వర్ రమేష్

చండ్రుగొండ: మండలంలోని దామరచర్ల గ్రామంలో జరుగుతున్న ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని స్టేట్ అబ్జర్వర్ రమేష్ శనివారం పరిశీలించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియను రికార్డులను పరిశీలించారు. వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు టి.సుశీల, పి.భవాని, ఆశావర్కర్లు ఆర్.వెంకటలక్ష్మి, ఎస్.నారాయణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త పి.విజయ పాల్గొన్నారు.

నేడు కందిపాడులో వైద్య శిబిరం

చర్లరూరల్: ఏజెన్సీ మారుమూల గ్రామమైన కందిపాడులో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ సందీప్ తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన సామాజిక తనిఖీ

దుమ్ముగూడెం: మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సామాజిక తనిఖీ శనివారంతో ముగిసింది. ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల కోడ్ అమలు దృష్ట్యా ఇన్ హౌజ్ వేదిక ద్వారా గత 3 రోజుల పాటు ఆడిట్ చేపట్టారు. ఏపీడీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై 2020, నవంబర్ 1 నుంచి 2023, మార్చి 31 వరకు ఈజీఎస్ పథకంలోని రూ.15.77కోట్ల పనులకు సంబంధించి ఆడిట్ నిర్వహించారు. మండలం మొత్తంగా అన్ని పంచాయతీలకు కలిపి రికవరీ రూ.8లక్షల 93వేల 490 చేయాల్సి ఉండగా.. రూ.1,45,500 వరకు ఉపాధి సిబ్బందికి జరిమానాలు విధించారు. 347 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సి ఉండగా.. జిల్లా, మండల స్థాయి అధికారులు 59 పనులపై విచారణ చేపట్టాల్సి ఉంది. కార్యక్రమంలో ఎంపీడీఓ ముత్యాలరావు, ఏపీఓ సుకన్య, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా సురేష్

అశ్వాపురం: యువజన కాంగ్రెస్ పినపాక నియోజకవర్గ అధ్యక్షుడిగా అబొల్లినేని సురేష్, కార్యదర్శిగా అశ్వాపురం మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన గజ్జి మనోజ్ నియమితులయ్యారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, పినపాక నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ధనసరి సూర్య శనివారం వీరిద్దరికి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గెలుపునకు తమవంతు కృషి చేస్తామన్నారు.

మండల అధ్యక్షుడిగా వీరన్న..

మణుగూరుటౌన్: మణుగూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా కురం వీరన్నను నియమిస్తూ తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి బి.రమేశ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులను పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధనసరి సూర్య.. వీరన్నకు తన క్యాంప్ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మణుగూరు మండల యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ

దమ్మపేట: మండల పరిధిలోని నల్లివారిగూడెం గ్రామంలో నిరుపేద కుటుంబాలకు, సత్తుపల్లి నగరానికి చెందిన సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను వితరణగా అందజేశారు. శనివారం నల్లివారిగూడెం గ్రామానికి చెందిన మల్లెబోయిన రమాదేవి, దానవు రాములమ్మ, నారం రాణిల నిరుపేద కుటుంబాలకు ఒక నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను ట్రస్ట్ ఫౌండర్, ఆయుర్వేద వైద్యురాలు కొనకళ్ల సుధారాణి చేతుల మీదుగా అందజేశారు. ట్రస్ట్ తరఫున భవిష్యత్తులోనూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అనాథాశ్రమానికి ఫ్యాన్లు వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కారుణ్య అనాథాశ్రమానికి నాలుగు ఫ్యాన్లను శనివారం వితరణగా అందించారు. పట్టణానికి చెందిన చారుగుళ్ల బాలకృష్ణ 75వ, వారి సతీమణి రత్నకుమారి 70వ జన్మదినం సందర్భంగా రూ.25 వేల విలువ చేసే ఫ్యాన్లను అందించారు. ఈ కార్యక్రమంలో చారుగుళ్ళ శ్రీనివాస్, బాలకృష్ణ, రేపాక శ్రీనివాస్, సాయిచంద్, శ్రీరామ్, సునీల్‌తోపాటు పలువురు వ్యక్తులు పాల్గొన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

ఈ ఏడాది బతుకమ్మ ఉత్సవాలు మొదలయ్యాయి. యువతులు, మహిళల మోముల్లో సందడి షురూ అయింది. తొమ్మిది రోజుల వేడుకల్లో భాగంగా తొలిరోజు శనివారం ఎంగిలిపూల బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. తీరొక్కపూలతో వాడవాడలా బతుకమ్మలను అందంగా పేర్చి మహిళలు గద్దెల వద్దకు తీసుకుని వచ్చారు. అందరూ ఏకమై తులసికి నైవేద్యం సమర్పించారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం వేడుకలను ఆరంభించారు. ఆటపాటలతో స్టెప్పులేశారు. బతుకమ్మ పాటల రాగాలు, చప్పట్ల తాళాలు, డీజే చప్పుళ్లతో ధూంధాం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



గుండాల: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కరకగూడెం: బతుకమ్మతో వస్తున్న ఎంపీపీ రేగా కాళిక, తదితరులు



భద్రాచలంటౌన్: బతుకమ్మ వేడుకలో ఎమ్మెల్యే వీరయ్య



ములకలపల్లి: భక్త అభయాంజనేయస్వామి ఆలయం వద్ద బతుకమ్మ ఆట..



అశ్వాపురం: మొండికుంటలో బతుకమ్మను పేరుస్తున్న మహిళ



చర్ల: పాతచర్లలో వేడుకకు ముందు గద్దె వద్ద తులసి మొక్కను పూజిస్తున్న మహిళలు



అశ్వాపురం: బతుకమ్మతో తరలివస్తున్న మహిళలు



బతుకమ్మకు మొక్కుతున్న చిన్నారి



బూర్గంపాడు: సారపాక గాంధీనగర్‌లో బతుకమ్మ సంబురాలు



గుండాల: ఆళ్లపల్లి మండలం మర్కోడులో..



మణుగూరురూరల్: బతుకమ్మలను తీసుకెళ్తున్న మహిళలు, యువతులు



మణుగూరుటౌన్: భగత్‌సింగ్ నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చంద్రకళ ఇంట పతకాల పంట

- అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న మహిళ
- నాలుగు పదుల వయసులోనూ తప్పని గురి

సండే స్పెషల్

అశ్వాపురం: ప్రస్తుతం క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ ఆటలపైనే క్రీడాకారులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. సరైన సదుపాయాలు, కోచ్‌లు లేకనో.. ప్రభుత్వం ప్రోత్సాహం లేక నోగాని అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని రాణించే క్రీడాకారులు చాలా తక్కువ. ఆ కొద్దిమందిలో చంద్రకళ ఒకరు.

మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీకి చెందిన క్రీడాకారిణి మొర్సినేని చంద్రకళ ఓ గృహిణి. ఈమె భర్త నారాయణరావు మణుగూరు భారజల కర్మాగారంలో ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్నారు. చంద్రకళ ఇంటి పనులు చక్కదిద్దుతూనే క్రీడలపై మక్కువతో అటుగా పయనిస్తోంది. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో రాణిస్తూ పతకాల పంట పండిస్తోంది. 45 ఏళ్లకు పైగా వయసున్నప్పటికీ.. ఆమె పోటీల్లో పాల్గొంటే పతకం పట్టాల్సిందే.

అవార్డులు.. రివార్డులు..

25, 26 జూన్, 2022 జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రథమ స్థానంతో మూడు బంగారు పతకాలు సాధించారు చంద్రకళ. 11 ఆగస్టు, 2022 హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. 16, 17 ఏప్రిల్, 2022లో 4వ తెలంగాణ మాస్టర్ బ్యాడ్మింటన్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీల్లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రథమ స్థానంతో బంగారు పతకాలు సాధించింది. 3,4 ఏప్రిల్, 2022లో మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీల్లో జావలిన్ త్రో, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, హ్యామర్‌త్రో విభాగాల్లో ప్రథమ స్థానంతో బంగారు పతకాలు సాధించింది. ఫిబ్రవరి, 2023లో హైదరాబాద్‌లో 5వ ఆల్ ఇండియా మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో జావలిన్, షాట్‌పుట్, హ్యామర్ త్రో, డిస్కస్‌త్రో విభాగాల్లో ప్రథమ స్థానంతో బంగారు పతకాలు, 1 అక్టోబర్ 2023న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో జావెలిన్ త్రో, షాట్‌పుట్, హ్యామర్ త్రో విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించి లక్నోలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. 8 అక్టోబర్, 2023న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో సింగిల్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్, స్పెషల్ కేటగిరి డబుల్స్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి నాలుగు బంగారు పతకాలు కైవసం చేసుకుంది. ఇవే కాక జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ పోటీల్లో చంద్రకళ మరెన్నో పతకాలు సాధించింది.

క్రీడలపై ఇష్టంతోనే..



చిన్నప్పటి నుంచి క్రీడలంటే నాకు చాలా ఇష్టం. మొదట బ్యాడ్మింటన్ ఆడేదాన్ని. తర్వాత అథ్లెటిక్స్‌లోను ఆడుతున్నా. చిన్నప్పుడు ఆడాక మధ్యలో ఆపివేశా. తర్వాత 35 ఏండ్ల తర్వాత మళ్లి ఆడుతున్నా. అందుకోసం క్రీడల్లో నా భర్త సహకారం, ప్రోత్సాహం అందించడంతో ఎన్నో పతకాలు సాధించా. నువ్వు ఆడగలవు, పతకం సాధించగలవు, టోర్నమెంట్‌లో పాల్గొనాల్సిందే అని నా భర్త అందించే ప్రోత్సాహం ఎప్పటికీ మరువలేను.

– చంద్రకళ



పోటీల్లో జావెలిన్ త్రో వేస్తున్న చంద్రకళ



రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో బంగారు పతకం, సర్టిఫికెట్ అందుకుంటూ..

లక్ష్యం ముందుంది..

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటి బంగారు పతకాలు సాధించిన చంద్రకళ.. జాతీయ స్థాయిలో రెండు విభాగాల్లో ఎంపికై ప్రాతినిధ్యం వహించనుంది. 2024, జనవరి 27 నుంచి 31 ఉత్తరప్రదేశ్ లక్నోలో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరగనుండగా.. అక్కడ చంద్రకళ తన సత్తా చాటనుంది. 2024, ఫిబ్రవరి 8 నుంచి 12 వరకు కూడా డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొననుంది. రాష్ట్ర స్థాయిలో బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీల్లో అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లో పలు టోర్నమెంటుల్లో చంద్రకళ పాల్గొననుంది.

కాంగ్రెస్‌దే విజయం



మణుగూరుటౌన్: తిర్లాపురం పంచాయతీలో కరపత్రాలు పంచుతున్న మాజీ ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్: రాబోయే రోజుల్లో ప్రజలు రాష్ట్రంలో, పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పట్టం కట్టడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా తిర్లాపురం పంచాయతీలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరుగుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చెపట్టబోయే ఆరు గ్యారెంటీలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైస్ ఎంపీపీ కేవీరావు, సమితిసింగారం ఉప సర్పంచ్ పుచ్చకాయల శంకర్ ఆధ్వర్యంలో ఓబీ బ్లాస్టింగ్ కాంట్రాక్ట్ కార్మికులు 50 మంది కాంగ్రెస్‌లో చేరగా వారికి పాయం వెంకటేశ్వర్లు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సొసైటీ డైరెక్టర్ గుండగాని నాగేశ్వరరావు, ఉపసర్పంచులు కంటెం సురేశ్, గోరంట్ల కనకయ్య, పగిడేరు మాజీ సర్పంచ్ తాటి భిక్షం, నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, రాజు, తమ్మిశెట్టి సాంబ, నాగరాజు, మానస, ఆదిలక్ష్మి, పాయం ప్రవీణ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

'జారె' ఇంటింటి ప్రచారం

ములకలపల్లి: కాంగ్రెస్ అశ్వారావుపేట నియోజకవర్గ నాయకుడు జారే ఆదినారాయణ శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజితో కలసి సీతాయిగూడెం జీపీ కేంద్రంతోపాటు కొమ్ముగూడెం, గండిపోలు, రేగులకుంట గ్రామాల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేశారు. ఉపసర్పంచ్ శనగపాటి అంజి, మాజీ ఎంపీపీ కుర్సం శాంతమ్మ, కోరంపల్లి చెన్నారావు, శనగపాటి రవి, కుంజా వెంకట్, ఎలకం వెంకటేశ్, గుంట్రు సాయి, జహీర్, భాస్కర్, మేకల రాజేశ్, వీరన్న పాల్గొన్నారు.

బాలాజీ ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నేటి నుంచి 24వ తారీకు వరకు శ్రీలక్ష్మి శరన్నవరాత్రోత్సవాలు, దసరా పవిత్రోత్సవాలను నిర్వహించనున్నారు. ఈనెల 15న శ్రీఆదిలక్ష్మి, 16న శ్రీసంతానలక్ష్మి, 17న శ్రీగజలక్ష్మి, 18న శ్రీధనలక్ష్మి, 19న శ్రీధాన్యలక్ష్మి, 20న శ్రీవిద్యాలక్ష్మి, 21న శ్రీఐశ్వర్యలక్ష్మి, 22న శ్రీవిజయలక్ష్మి, 23న శ్రీ మహాలక్ష్మి, 24న శ్రీనిజరూపలక్ష్మిగా అమ్మ వారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ నెల 24 వ తారీకు విజయదశమి రోజున ఉదయం 11 గంటలకు స్వామి వారి కల్యాణం జరపనున్నారు. ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లూ చేశారు.

రేగా హ్యాట్రిక్ ఖాయం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు

బూర్గంపాడు: పినపాక అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ముచ్చటగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్‌గా నిలుస్తాడని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు నాయక్ అన్నారు. సారపాకలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి రేగా చేసిన కృషి ఎనలేనిదన్నారు. మారుమూల గ్రామాల్లో సైతం మెరుగైన మౌలికవసతులు కల్పించి అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచాడన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు, డ్రెయినేజీల అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు కొనకంచి శ్రీనివాసరావు, బాలి శ్రీహరి, పొడియం నరేందర్, చలకోటి పూర్ణచందర్ రావు, బానోతు శ్రీనివాస్, కోటమర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పేరుకుపోయిన చెత్త



మణుగూరు మున్సిపాలిటీ భగత్‌సింగ్‌నగర్, శేషగిరినగర్ ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం భారీగా పేరుకుపోయింది. ప్రధాన రహదారి కూడళ్లలో కూడా చెత్త కుప్పలుకుప్పలుగా నిల్వ ఉంటోంది. మున్సిపాలిటీ అధికారులు చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లడంతోపాటు స్థానికులు, బాటసారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– మణుగూరురూరల్

ప్రశ్నించాల్సిన అధికారి: ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్, మణుగూరు
ఫోన్ నంబర్: 9849909514

పల్లెల్లో ప్రయాణికుల పాట్లు

- గ్రామాల్లో ఏర్పాటు చేయని బస్సు షెల్టర్లు
- ఎండావానల్లోనే బస్సుల కోసం ఎదురుచూపులు

చర్ల: మండలంలోని పలు గ్రామాల్లో బస్సు షెల్టర్లు లేక ప్రయాణీకులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇటు భద్రాచలం అటు వెంకటాపురం ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ప్రధాన రహదార్లపై బస్సుల రాక కోసం ఎదురు చేసే సందర్భాల్లో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ప్రయాణాలను సాగిస్తున్నారు. ఇటు స్థానిక పంచాయతీలతో పాటు అటు ఆర్టీసీ కూడా ఈ సమస్య పరిష్కారంపై దృష్టి సారించడం లేదు. పల్లెల్లో లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తున్న పంచాయతీలు కనీసం ఒక లక్ష రూపాయలు వెచ్చిస్తే సమస్య పరిష్కారం కానుండగా వారు పట్టించుకోవడం లేదు. ఇక ప్రయాణీకులే ఆర్టీసీ సంస్థకు దేవుళ్లని చెప్పుకునే ఆర్టీసీ కూడా బస్ షెల్టర్ల ఏర్పాటుపై ఆసక్తిని చూపక పోవడంతో ప్రయాణీకులు తీవ్ర అసౌకార్యానికి గురవుతున్నారు. మరోవైపు కొన్ని గ్రామాల్లో ఉన్న బస్ షెల్టర్ల ఉన్నప్పటికీ నిర్వహణ లోపంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

చర్ల మండలంలోని మామిడిగూడెం, దేవరాపల్లి, ఆర్ కొత్తగూడెం, సత్యనారాయణపురం, కలివేరు, తేగడ, గుంపెన్నగూడెం, రాళ్లగూడెం, చర్ల గాంధీ సెంటర్, సీ కత్తిగూడెం, కొయ్యూరు, సుబ్బంపేట తదితర గ్రామాల్లో బస్సు షెల్టర్లు లేవు. ఈ ప్రాంతాల్లో రోడ్డు వెంబడి నిలుచుని బస్సుల కోసం ఎదురుచూడాలి. దంచికొట్టే ఎండైనా.. జోరువానైనా ఇలానే ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. పిల్లలు, వృద్ధులైనా ఇదే దుస్థితి. ఇకపోతే, రాళ్లగూడెం, కుదునూరు, పెదమిడిసిలేరు క్రాస్ రోడ్, కేశవాపురం, కొయ్యూరు గ్రామాల్లో పేరుకు బస్ షెల్టర్లు ఉన్నాయి. కాని వాటి బాగోగులపై పట్టింపు లేకపోవడంతో అవి శిథిలమవుతున్నాయి. అందులో కూర్చోవాలంటనే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న బస్‌స్టాప్‌ల నిర్వహణ లేకపోవడం పూర్తిగా అధికార, స్థానిక ప్రజాప్రతినిధుల లోపమే. కొత్తవి నిర్మించాలన్నా సాధారణ వ్యయంతో పూర్తి చేయొచ్చు. కానీ ఆ మేరకు చిత్తశుద్ధి ఉండాలి కదా! ప్రతీ ఎన్నికల సందర్భంలో అభివృద్ధిపై హామీలు గుప్పించే పార్టీల నాయకులు ఈ సమస్యలపై ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.



మామిడిగూడెంలో రోడ్డు మీదే బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు



కొయ్యూరులో ప్రయాణికులు కూర్చునేందుకు అనువుగా లేని బస్సు షెల్టర్

బస్ షెల్టర్లు నిర్మించాలి



గ్రామాల్లో బస్సు షెల్టర్లు లేకపోవడంతో ఎండలో, వానలో నిలబడి బస్సుల కోసం ఎదురు చూస్తూ ఇబ్బందులు పడుతున్నాం. ఆర్టీసీ అధికారులకు, పంచాయతీ అధికారులకు విన్నవిస్తున్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో వెంటనే బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాలి.

– సీహెచ్ సత్యనారాయణ, ఆర్ కొత్తగూడెం

మరమ్మతులు చేయించాలి



గతంలో స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో పలు గ్రామాల్లో బస్ షెల్టర్లను నిర్మించినప్పటికీ వాటి నిర్వహణను పంచాయతీలు గానీ, ఆర్టీసీ అధికారులు గానీ చూసుకోవడం లేదు. అవి కూర్చునేందుకు అనుకూలంగా లేక వాటిల్లో ఉండడం కంటే భయట నిలబడడమే మంచిదనిపిస్తోంది.

– ఎం.రాజు, తేగడ